క్లుప్తంగా

బాలకేంద్రానికి చేసిన కృషి వెలకట్టలేనిది..



నారాయణపేట రూరల్ : ప్రముఖ కవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరాఫ్‌కృష్ణ బాలకేంద్రానికి చేసిన సేవలు వెలకట్టలేనివని సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంగనర్సింహులు, వసంత్‌కుమార్, రామకృష్ణకల్యాణి, జ్ఞానామృత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



మరికల్: మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మురళిని పస్పుల గ్రామ కాంగ్రెస్ నాయకులతోపాటు ఎంపీటీసీ జయమ్మ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండల ప్రజలు శాంతి భద్రత పరిరక్షరణకు సహకరించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవిగౌడ్, రాజు, సిద్దప్ప, నర్సింహులు, శ్రీను, బోజన్న పాల్గొన్నారు.

ఓటుహక్కు కోసం దరఖాస్తులు



నర్వ: మండల సింగిల్ విండోలో ఓటరు నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నట్లు సీఈఓ ఉదయ్ తెలిపారు. ఈ సందర్భంగా గత వారం రోజులుగా ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల అర్హులైన రైతులు తమ ఓటు హక్కు కోసం విండో కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్నారన్నారు. ఓటు హక్కు కోసం పట్టదారు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, కొత్త ఆర్వోఆర్, పహణీలు, మూడు పాస్‌ఫోటోలు దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలను నమోదు చేసి అందించాలన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

కృష్ణా: భీమనది తీర ప్రాంత రైతులకు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని, తమకు సమీపంలోని కర్ణాటకలోని గూడూర్ బ్యారేజీ నుంచి ఒక్క టీఎంసీ నీటిని విడుదల చేయించాలని కోరుతూ ఆ ప్రాంత రైతులు ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాయిచూర్‌కు చెందిన మంత్రి బోసురాజుకు ఈ విషయాన్ని వివరించి త్వరలోనే నీటిని విడుదల చేయించేందుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఇందులో రైతులు దేవేంద్రప్ప, ప్రభాకర్‌రెడ్డి, మోనేష్‌తో పాటూ సూకూర్ లింగంపల్లి, కుసుమర్తి రైతులు ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం తనిఖీ

మక్తల్: పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అధికారి వేణుగోపాల్ సెంటర్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఏ విధంగా జరుగుతుందని పరిశీలించారు. అనంతరం బాలికలకు ఉచితంగా ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీఓ తిరుపతయ్య, లీగల్ అధికారి కవిత, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మరికల్: సమాచారహక్కు వికాస సమితి నూతన క్యాలెండర్‌ను బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు శివ, వెంకటేష్, నర్సింహులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి

మద్దూరు: మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ సతిమణి రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమాబాయి చేసిన త్యాగం వల్లే అంబేడ్కర్ దేశానికి ఇంత సేవా చేయగల్గిగాడని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కృష్ణమౌర్య, మండల కార్యదర్శి వెంకట్, నాయకులు కృష్ణనాయక్, లాలు ప్రసాద్, పోన్నయ్య, చిన్నయ్య, సాయిలు, శంకర్, దాసు పాల్గొన్నారు.



విద్యాశాఖలో సమస్యలు పరిష్కరిస్తా

- తన నిధుల నుంచి 30 శాతం నిధులు కేటాయిస్తా
- కృష్ణా సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణా: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, ఇతర సౌకర్యాల నిమిత్తం తన ఎమ్మెల్యే నిధుల నుంచి 30 శాతం నిధులు కేటాయిస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పూర్ణిమ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా ఈ మండలం చాలా వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలోని పాఠశాలలు కొన్ని కన్నడ మీడియం, కొన్ని తెలుగు మీడియం ఉండటంతో కన్నడ మీడియం చదివిన విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వారికి కర్ణాటకలో కాని, తెలంగాణలో ఉద్యోగ, విద్యా అవకాశాలు రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ ఇబ్బందులు లేకుండా విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఒక్క సెంటర్‌కు మాత్రమే ప్రభుత్వ భవనం..

ఐసీడీఎస్ శాఖకు సంబంధించి మండలంలో 33 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. కేవలం ఒక్క సెంటర్‌కు మాత్రమే ప్రభుత్వ భవనం ఉందన్నారు. మిగితా కేంద్రాలకు భవనాలు లేక ఇబ్బందులు ఉన్నాయని సూపర్‌వైజర్ అమ్మక్క సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. తక్షణమే గ్రామాల్లోని పాత గ్రామపంచాయతీ భవనాలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని, అదే విధంగా కొత్త భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యుత్ శాఖ, ఉపాధి హామీ, రెవెన్యూ, వైద్య శాఖలకు చెందిన అధికారులు వారి ప్రగతి నివేదికలను సభకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ మండలం అత్యంత వెనుకబడి ఉందని, ఈ మండలం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. అభివృద్ధి విషయంలో తాను ఏ సమయంలో ఏ సహాయ సహకారాలు కావాలన్నా.. అందుబాటులో ఉండి సహకరిస్తానని అన్నారు. అదే విధంగా గతంలో మాదిరిగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించి మమ అనిపించడం కాదని, వచ్చే సమావేశానికి ప్రస్తుతం చర్చించిన అన్ని విషయాలు కూడా పూరోగతిలో ఉండాలని సూచించారు. అధికారులు పనిచేయాలని లేకుంటే పరిణామాలు వేరుగా ఉంటాయని అన్నారు. నేను సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేను అయ్యాను, గ్రామాల్లో ఏ సమస్యలు ఉంటాయో తెలుసని, వాటిని ఎలా పరిష్కరించాలో తనకు తెలుసన్నారు. ఎంపీడీఓ యశోద, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, వైస్ఎంపీపీ ఈశ్వరప్పగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంచందర్, డా.విరోజ, ఎంఈఓ వెంకటయ్య, ఏఈ ధర్మతేజ, ఏఓ సుదర్శన్‌గౌడ్, ఏపీఓ యాదవరాజ్, ఏపీఎం బస్వరాజ్ పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు..

సమావేశంలో కేవలం సంబంధిత శాఖల అధికారులతో పాటూ గౌరవ ఎంపీటీసీ సభ్యులు మాత్రామే ఉండాలి. కాని అందుకు విరుద్ధంగా సమావేశంలో మహిళా ప్రజాప్రతినిధులకు బదులుగా వారి భర్తలు హాజరవడంతోపాటూ ఏకంగా చర్చల్లో పాల్గొన్నారు. అదేవిధంగా కొందరి మండల ప్రజాప్రతినిధులకు సంబంధించిన డ్రైవర్లు గౌరవ సభ్యులు సమావేశంలో కూర్చోవడం, కొన్ని శాఖల అధికారుల అటెండర్లు ఈ సమావేశంలో కూర్చోవడం కనిపించింది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి వెంకట్

కోస్గి: మండల పరిధిలోని వివిధ గ్రామలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమంకోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ గ్రామాలకు చెందిన 40మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కాళప్పతోపాటు పలువురు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

శక్తివందన అభియాన్ ఇన్‌చార్జి నియామకం

నారాయణపేట రూరల్: మహిళ స్వయం సంవృద్ధి శక్తి అభియాన్ పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్టణానికి చెందిన లక్ష్మిని నియమించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ఆమె మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి



మరికల్: ఇళ్ల నిర్మాణాల కోసం ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని బుధవారం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ సునితకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు.. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, మేస్త్రీ కుర్మన్న మాట్లాడుతూ.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గృహ నిర్మాణదారులకు, పనులు లేక ఇంటి వద్ద ఉంటున్న కార్మికులకు పనులు కల్పించేలా తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని కోరారు. కొండప్ప, ఎల్లప్ప, కొండన్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



దామరగిద్దలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



ధన్వాడలో..

మక్తల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారి నాగశివ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. బుధవారం మండంలోని మాద్వార్‌లో కొనసాగుతున్న డ్రెయినేజీ పనులను పరిశీలించి మాట్లాడారు.. కార్యక్రమంలో కార్యదర్శులు తాజొద్దీన్, రవి, అశోక్‌గౌడ్, జగదీష్ పాల్గొన్నారు.

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యంపై బుధవారం నుంచి ఈ నెల 15 వరకు చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పారిశుద్ధ్య పనులపై అవగాహన నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో వైన్స్ పరిసప్రాంతాల్లో చెత్తను తొలగింప చేశారు. ఈ మేరకు.. స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లిలో బుధవారం ప్రత్యేక పరిశుద్ధ్య కార్యక్రమం ప్రారంభించారు. గ్రామంలో స్వచ్ఛత కోసం బుధవారం నుంచి ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

మరికల్: గ్రామాల్లో ఎప్పటిక్పుకప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడితే వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చునని ప్రత్యేక అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఎలిగండ్లలో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని, డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవమ్మ, మోహన్, ప్రకాష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ఈ నెల 7 నుంచి 14వరకు మండలంలో ప్రతి పంచాయతీ పరిధిలో నిర్వహించడం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని 16పంచాయతీల పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని ప్రత్యేకాధికారి రమేష్‌కుమార్ వివిధ హోటళ్లను పరిశీలించారు. ప్రత్యేకాధికారులు శ్రావణ్‌కుమార్, కార్యదర్శి సుమలత, గ్రామస్తులు కతలప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..



ఊట్కూరు: మండలంలోని లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ ఖాదర్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, బస్వప్ప పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా చూడాలి

మాగనూర్: మండల పరిధిలోని ఉజ్జెల్లి ముంపు గ్రామ నష్టపరిహారం విడుదల చేయాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు డిప్యూటీ కలెక్టర్ అశోక్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామం ఉజ్జెల్లి ఆర్అండ్ఆర్ సెంటర్‌కు రావాల్సిన నష్టపరిహారం రూ. 13,34,59,00 రూపాయాలు మంజూరైనా నిధులు ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యమైందన్నారు. సంబంధిత అధికారులు నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుతారి రవి, సురేష్, ఆంజనేయులు, కనకరాజ్, బస్వారజ్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను తొలగించాలి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కాళిదాసును తొలగించాలని కాంగ్రెస్ నాయకులు ఎలక్ట్రిసిటీ ఏఈ సాయినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కాళిదాసు విధులు సక్రమంగా నిర్వహించడంలేదని, రైతులకు అవసరమైన త్రి ఫేజ్ కరెంటు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, వెంటనే ఆపరేటర్‌ను తొలగించాలని కోరారు. రాజు, ప్రభంజన్‌రావు, రాము, రవి పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి



నారాయణపేటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు



ఊట్కూరులో..



కోస్గిలో సైన్స్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: విద్యార్థులు తమ చిన్నతనం నుంచే సైన్స్‌పై ఆసక్తి పెపొందించుకోవాలని డీఎస్ఓ భానుప్రకాష్ అన్నారు. నేషనల్ సైన్స్ డే కార్యక్రమం సందర్భంగా బుధవారం మండల స్థాయి పోటీలను జాజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యతతో పాటు శాస్త్రజ్ఞులు చేసిన కొత్త ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ప్లాస్టిక్ నిషేదంపై వివిధ రకాల పోటీలను నిర్వహించారు. డ్రాయింగ్‌లో సంతోష్ (గ్రౌండ్ స్కూల్-నారాయణపేట), కవిత్వంలో మహేశ్వరీ (పీహెచ్ఈఎస్-నారాయణపేట), పాటలపోటీలో అనంతప్ప (గ్రౌండ్‌స్కూల్-నారాయణపేట), ఉపన్యాస పోటీలో ఆనంద్ (గ్రౌండ్‌స్కూల్-నారాయఫపేట)లు ఎంపికయ్యారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కనకప్ప, సంజీవ్‌రెడ్డి, దేవిరాణి, గిరిజ, ప్రసాద్, వనిత, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ పోటీలు

కోస్గి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు పలు అంశాల్లో సైన్స్ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ మండల స్థాయి పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అనే ప్రధాన అంశంతో చిత్ర లేఖనం, కవితలు, పాటల పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూరు: సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఉపన్యాసం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈమేరకు.. మండల నోడల్ అధికారి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అభిరుచి పెంచుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, నర్సింగప్ప, బస్వరాజ్, సబాసుల్తానా, రాములు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి (మద్దూరు): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, కవిత్వం, ఉపన్యాస తదితర పోటీలు నిర్వహించగా ఉమ్మడి మండలం నుంచి జిల్లాస్థాయి పోటీలకు రాజేశ్వరీ, కావేరి, సత్యమ్మ, అనిల్‌నాయక్ ఎంపికైనట్లు మండల నోడల్ అధికారి లాజర్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నారాయణపేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పీఎస్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు బృందాలు బుధవారం ఆయా ప్రాంతాల్లోని ప్రయాణికులు, వాహనదారులతో మాట్లాడి అవగాహన కల్పించారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్ ఫోన్ ఇవ్వడం చేయరాదన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

మాగనూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మన్నన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్‌చేసి మీకు లాటరీలు తగిలాయని, తక్కువ ధరకే ఆన్‌లైన్ వస్తువులు వస్తాయని ఇలా వివిధ రకాలుగా మోసాలు చేసే వ్యక్తులు నుంచి పోన్‌కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ అర్జున్, కానిస్టేబుల్స్ రాజశేఖర్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలని ధర్నా



పేట మున్సిపల్‌పార్కు వద్ద ఏఐపీకేఎస్ ధర్నా

నారాయణపేట: అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గొర్రెల పంపిణీకోసం డీడీలు చెల్లించిన ప్రతి కురువ, గొల్ల యాదవులకు వెంటనే గొర్రెల పంపిణీ చేపట్టాలని జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పార్కు వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశానికి అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి మాట్లాడుతూ .. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించి కురవ, గొల్ల యాదవుల జీవితాల్లో వెలుగులు నింపుతానని ప్రగల్భాలు పలకడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వారికి పావుల శాతం కుటుంబాలకు గొర్ల పంపిణీ చేయలేదన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీకోసం సంవత్సరం క్రితం దాదాపు 7,1856 మందితో డీడీల రూపకంగా 31.43 కోట్లు కట్టించుకున్నారన్నారు. ఇందులో 1,274 మందికి పంపిణీ చేసి మిగతా 5,912మంది లబ్ధిదారుల కుటుంబాలకు మొండి చేయిచూపించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న సీడీపీఓ రోజా

కోస్గి (మద్దూరు) మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని డాట్ కం కంప్యూటర్ సెంటర్ ద్వారా విద్యార్థినులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ విద్యార్థినులకు బుధవారం స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ రోజా ట్రైనింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. ఈ సెంటర్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఏ విధంగా జరుగుతుందని పరిశీలించారు. ఉచితంగా ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్ర ఆర్థిక నిపుణుడు విజయ్‌కుమార్, శ్రావణి, కంప్యూటర్ అపరేటర్ నర్సింహ పాల్గొన్నారు.

రక్తహీనతకు చికిత్స కంటే నివారణే ఉత్తమం



రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

నర్వ: రక్తహీనతతో బాధపడుతున్న వారికి చికిత్స కంటే నివారణే ఉత్తమమని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కృష్ణప్రియ అన్నారు. బుధవారం ఉందేకోడ్‌లో అంగన్‌వాడీ సెంటర్ 3లో రక్తహీనతకోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు బిడ్డకు పాలిచ్చే సమయాల్లో పౌష్టిక సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారి ఆహారంలో అన్ని రకాల పండ్లు, కూరగాయలు, ఆకకూరలు తప్పకుండా తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న వారు ఎప్పటికప్పుడుశరీరంలోని రక్త స్థాయిలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సల్యమ్మ, ఆశా కార్యకర్త శివలింగమ్మ, అంగన్‌వాడీ టీచర్ అనురాధ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిలువురాళ్ల పుస్తక సమీక్ష..

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల హెచ్ఎంలకు ఇటీవల ఉన్నతాధికారులు విడుదల చేసిన నిలువురాళ్ల పుస్తకాన్ని సమీక్షించారు. జిల్లాలోని సుప్రసిద్ధ స్థలాలు, చారిత్రక స్థలాలపై పుస్తకంలోని అంశాలను సమీక్షించారు. ఆయా పాఠశాలలోని విద్యార్థుల ప్రగతిని, తొలిమెట్టు లక్ష్యాలను సమీక్షలో చర్చించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహులు, డీఆర్పీ లక్ష్మణ్, సెక్రటరీ మల్లేష్, సీఆర్పీ నర్సింహులు, హెచ్ఎంలు సత్యనారాయణరెడ్డి, వెంకటన్న, తిరుపత్య, రవి కుమార్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆర్థిక సాయం అందజేత

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1978 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో నిర్మిస్తున్న సరస్వతీ మాత ఆలయ నిర్మాణానికి రూ.45వేల ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం హెచ్ఎం రమేష్ శెట్టికి నగదును అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం నగదు అందజేయడం సంతోషకరమని హెచ్ఎం అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉదయభాను, సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు సత్తార్ స్వాముల వార్షికోత్సవం

నర్వ: శ్రీ సద్గురు సత్తార్ సత్యానంద స్వాములవారి వార్షికోత్సవం బుధవారం సాయంత్రం పెద్దకడ్మూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్వామి వారికి పూజాదికార్యక్రమాలను కొనసాగించారు. పంచామృతాభిషేకాలు, మహామంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శిష్యుల బృందంచే నిర్వహించిన ప్రత్యేక భజనలు అలరించాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన స్వాములవారి శిష్యబృందం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రతిభా పోటీలు

నర్వ: మండలంలోని అన్నిపాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో .. పాటల పోటీల్లో భవిత 8వ, తరగతి ఎంజేపీటీ నర్వ, ఉపన్యాస పోటీల్లో ప్రత్యుష 8వ, తరగతి జెడ్పీహెచ్ఎస్ నర్వ, డ్రాయింగ్ పోటీల్లో యామిని 9వ, తరగతి కేజీబీవీ నర్వ, సైన్స్ కవిత్వం పోటీల్లో నందిని 9వ, తరగతి ఉందేకోడ్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు.